సాక్షి నిజామాబాద్

గురువారం । 3 । అక్టోబర్ । 2024



రెడ్‌క్రాస్ సేవలు ఆదర్శనీయం

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా వార్డును జిల్లా జడ్జి సునీత కుంచాల సందర్శించారు.

- 10లో ▸



గాంధీజీకి నివాళులు

జిల్లాలో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఘన నివాళులు అర్పించారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
40.3 /22.0

వాతావరణం

ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

- తొలిరోజు 220 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



నిజామాబాద్ అర్బన్: డీఎస్సీ- 2024 నియామకాలకు సంబంధించి ఎట్టకేలకు మెరిట్ లిస్టులు విడుదల చేశారు. అంతేగాక 1:3లో ఎంపికైన అభ్యర్థులకు బుధవారం నుంచి ఎస్ఎంఎస్‌లు, మెయిల్స్ రావడం ప్రారంభమయ్యాయి. దీంతో అభ్యర్థులు సమాచారం అందగానే జిల్లా కేంద్రంలోని నిర్మల హృదయా పాఠశాలలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. బుధవారం 220 మంది అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టినట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. జాబితా వెలువడటంతో ఆలస్యం కావడంతో అభ్యర్థులు ఆందోళన చెందారు. సాంకేతిక కారణాలతో జాబితా రావడం ఆలస్యమైందని అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్జీటీ పోస్టులకు సంబంధించి జిల్లా విద్యాశాఖ మొదట మెరిట్ జాబితా విడుదల చేసింది. అనంతరం పీఈటీ, స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన జాబితాను విడుదల చేశారు. ప్రస్తుతానికి సమాచారం వచ్చిన వారికి మాత్రమే విద్యాశాఖ అధికారులు ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నారు. జిల్లాలో 135 స్కూల్ అసిస్టెంట్లు, 434 ఎస్జీటీ, 23 లాంగ్వేజ్ పండిత్, 9 పీఈటీ పోస్టులను భర్తీ చేయనున్నారు. కాగా అవసరమైన ధ్రువపత్రాలు అందుబాటులో లేకపోవడంతో కొందరు అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసిన వెంటనే రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 5లోపే వెరిఫికేషన్ ముగించాలని విద్యా శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అభ్యర్థులు మరింత గడువు కావాలని కోరుతున్నారు.

రేపు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య ఈ నెల 4న జిల్లాకు రానున్నారు. అట్రాసిటీ కేసులు, దళితులకు సంబంధించిన సమస్యల పరిష్కారం ఇతర విషయాలపై కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో కలిసి సమీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సారెస్పీ గేట్ల మూసివేత



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో బుధవారం మధ్యాహ్నం వరద గేట్లను మూసివేశారు. ప్రాజెక్ట్‌లోకి 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వరద కాలువ ద్వారా 12 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 2 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, గుత్పలిప్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల కాగా బుధవారం సాయంత్రానికి అంతే నీటిమట్టంతో నిండుకుండలా ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

నిజాంసాగర్ మూడు గేట్ల ఎత్తివేత



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం 8 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తి 12 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ఆయకట్టు పంటల అవసరాల కోసం ప్రధాన కాలువకు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)తో కళకళలాడుతోంది.

కరాటే మాస్టర్ నుంచి పీసీసీ చీఫ్‌గా!

- మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్థానం
- బ్రూస్‌లీ సినిమా 'ఎంటర్ ది డ్రాగన్' చూసి ప్రేరణ పొంది..
- 'వరల్డ్ కరాటే ఫెడరేషన్' నుంచి 'సిక్స్ డాన్'గా గుర్తింపు
- విద్యార్థి రాజకీయాల్లో చురుకైన పాత్ర
- కాంగ్రెస్‌లో అంచెలంచెలుగా ఎదిగిన వైనం
- జాతీయ నాయకత్వం, రాష్ట్రాల నేతలతో సఖ్యత
- పార్టీ ఆర్గనైజేషన్, నేతలను సమన్వయం చేయడంలో దిట్ట

విద్యార్థి దశలోనే కరాటే మాస్టర్‌గా విశేష ఆదరణ పొందిన మహేశ్ కుమార్ గౌడ్ రాజకీయాల్లోనూ మక్కువ చూపి రాణించారు. 'వరల్డ్ కరాటే ఫెడరేషన్' నుంచి 6వ డాన్ గా ఉన్నతస్థాయి గుర్తింపు పొందారు. పీసీసీ పగ్గాలు చేపట్టిన తర్వాత గాంధీభవన్‌కు ఇద్దరు మంత్రులు వచ్చి కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా షెడ్యూల్ రూపొందించారు. ఇది పార్టీ నిర్వహణలో ఆయన సమర్థతకు నిదర్శనమంటున్నారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కరాటే మాస్టర్‌గా జీవన ప్రస్థానాన్ని ఆరంభించిన బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు చేపట్టారు. 1977లో 7వ తరగతి చదువుతున్నప్పుడు బ్రూస్‌లీ నటించిన 'ఎంటర్ ది డ్రాగన్' సినిమా విడుదలైంది. ఈ సినిమా చూసి ప్రేరణ పొందిన మహేశ్‌గౌడ్ కరాటే మాస్టర్ శ్రీనివాసన్ వద్ద శిక్షణ కోసం చేరారు. 1983లో మొదటి సారిగా రాష్ట్రం నుంచి కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించిన వారిలో ఒకరిగా నిలిచారు. నిజామాబాద్‌లోని శంకర్‌భవన్ స్కూల్, పాలిటెక్నికల్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కరాటే శిక్షణ మాస్టర్‌గా పనిచేశారు. 1990 వరకు కరాటే ప్రాక్టీస్ చేస్తూ 'వరల్డ్ కరాటే ఫెడరేషన్' నుంచి 6వ డాన్ గా ఉన్నతస్థాయిలో కొనసాగారు. దేశవిదేశాల్లో అనేక టోర్నమెంట్లలో పాల్గొన్నారు. సింగపూర్, థాయ్‌లాండ్, దుబాయ్, మలేషియాల్లో టోర్నీల్లో పాల్గొన్నారు. పాత మిత్రులు ఇప్పటికీ తనను కరాటే మహేశ్‌గానే పిలుస్తారని మహేశ్‌కుమార్ గౌడ్ చెబుతున్నారు.

జాతీయ నేతలలో సాన్నిహిత్యం..

పార్టీ ఆర్గనైజేషన్ స్కిల్స్‌లో దిట్టగా పేరు పొందారు. అందరితో సఖ్యతగా ఉండడంతో జాతీయ స్థాయి నేతలు, ఇతర రాష్ట్రాల నేతలు మిత్రులుగా మారారు. మాధవరావు సింధియా, రాజేశ్ పైలట్, రమేశ్ చెన్నితాల, ముకుల్ వాస్నిక్, ప్రస్తుత హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సక్కు, అరుణాచల్ ప్రదేశ్ మాజీ సీఎం నపమ్ తక్కీలతో అత్యంత సాన్నిహిత్యం ఉంది. ప్రస్తుతం మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కార్యకర్తల సహకారంతో పీసీసీ అధ్యక్షుడిగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు నియామకం చేసినట్లు మహేశ్‌గౌడ్ తెలిపారు.

- భీంగల్ మండలంలోని మారుమూల రహత్‌నగర్‌కు చెందిన గంగాధర్ గౌడ్, మణెమ్మ కుమారుడైన మహేశ్ గౌడ్‌కు అక్క, చెల్లి, తమ్ముడు ఉన్నారు. తండ్రి గంగాధర్ గౌడ్ గ్రామంలో అసల్ దారు(జమీందారు)గా ఉండేవారు. గ్రామపాలన నిర్వహించారు. కాంగ్రెస్ సానుభూతి పరుడుగా ఉండేవారు. దీంతో మహేశ్‌గౌడ్‌కు రాజకీయాలపై ఆసక్తి పెరిగి కాంగ్రెస్ విద్యార్థి విభాగంలోకి వెళ్లి పనిచేశారు. చదువుపై ఆసక్తితో గంగాధర్ గౌడ్ పిల్లల చదువు కోసం నిజామాబాద్‌లో ఇల్లు తీసుకుని కాన్వెంట్ చదువులు చదివించారు. మహేశ్‌గౌడ్ 1980లో టెన్త్, 1981-82లో ప్రభుత్వ కాలేజీలో ఇంటర్, తర్వాత గిరిరాజ్ కళాశాలలో బీకాం చదివారు. మహేశ్‌గౌడ్ భార్య సంధ్యారాణి. పెద్ద కుమారుడు రిత్విక్ ఆస్ట్రేలియాలో చదువుతుండగా, చిన్న కుమారుడు ప్రణవ్ బీబీఏ ఎల్ఎల్‌బీ చదువుతున్నాడు. విద్యపై మక్కువతో మహేశ్‌గౌడ్ ప్రతి సమావేశంలో చదువు ప్రాధాన్యత గురించి చెబుతారు. బొమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ స్థాపించి 1993 నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులతో సేవలందిస్తున్నారు.

డీఎస్ ప్రోత్సాహంతో..

కరాటే ప్రాక్టీస్ చేస్తూనే మహేశ్‌గౌడ్ 1983 నుంచి ఎన్ఎస్‌యూఐలో చురుకుగా పనిచేశారు. 1986లో కాంగ్రెస్ అగ్రనేత ధర్మపురి శ్రీనివాస్ (దివంగత) ప్రోద్బలంతో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 1988లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఈ సమయంలో ఢిల్లీలో సఖ్యత పెరిగింది. పొంగులేటి సుధాకర్ రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, ఆలిండియా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మనీష్ తివారీ సహకారంతో కార్యక్రమాలు చేశారు. దీంతో రాజీవ్‌గాంధీ 1990లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం చేశారు. 1990-98 మధ్యకాలంలో రాష్ట్ర అధ్యక్షుడిగా అనేక విద్యార్థి ఉద్యమాలు చేశారు. ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ప్రవేశపెట్టిన మెడికల్ కళాశాలల్లో క్యాపిటేషన్ ఫీజు విధానానికి వ్యతిరేకంగా పతాక శీర్షికల కెక్కారు. స్వపక్షంలోనే విపక్షంగా ఈ విషయంలో గుర్తింపు పొందారు. 1998-2000 వరకు అఖిల భారత యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా అధ్యక్షుడు మనీష్ తివారీ సూర్జేవాలా నేతృత్వంలో పనిచేశారు. రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో అధిక సాన్నిహిత్యం ఉంది.



పార్టీ కోసం శ్రమిస్తూ..

పార్టీ కోసం రోజూ 15-16 గంటలు పనిచేస్తానని చెబుతున్న మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడు అయ్యాక నిరంతరం వస్తున్న సందర్శకుల తాకిడిని ఓపికగా హ్యాండిల్ చేస్తున్నారు. పార్టీకి కార్యకర్తలే బలమని చెబుతున్న మహేశ్‌గౌడ్ అధ్యక్ష పీఠం ఎక్కగానే కార్యకర్తలకు మనోధైర్యం కల్పించేందుకు గాను ప్రతివారం గాంధీభవన్‌కు ఇద్దరు మంత్రులు వచ్చి అందుబాటులో ఉండేలా షెడ్యూల్ రూపొందించారు. జిల్లా పార్టీ కార్యాలయాలకు సైతం మంత్రులు విధిగా వెళ్లాలని చెప్పారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలతో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లనున్నట్లు మహేశ్‌గౌడ్ తెలిపారు.

ఆలయాలు కట్టించిన కుటుంబం

మహేశ్‌గౌడ్ కుటుంబం ఆనాడే గ్రామంలో శివాలయం, రామాలయం కట్టించింది. అమ్మవారు, శివుడు, వెంకటేశ్వరస్వామిని రోజూ పూజిస్తారు. పూజ చేయకుండా మహేశ్‌గౌడ్ బయటకు రారు. దేశంలో ముఖ్యమైన అన్ని ఆలయాలను సందర్శించారు. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి 30 దేశాల వరకు తిరిగారు. ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు ఉన్న స్నేహితులను ఇప్పటికీ ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి కలుస్తుంటారు. స్నేహితులు, బంధువులను కలవడం హాబీ.

రెండుసార్లు అసెంబ్లీకి పోటీ..



1994లో పీవీ నరసింహారావు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వగా ఎన్టీఆర్ ప్రభంజనంలో, 2014లో ఎంఐఎం పోటీ చేయడంతో మహేశ్‌గౌడ్ ఓడిపోయారు. 1999, 2004లో ఎంపీ టికెట్లు దక్కకపోవడంతో 2004లో ఆరు నెలల పాటు టీడీపీలోకి వెళ్లారు. మళ్లీ దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పిలుపుతో కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చారు. 2013లో స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు.



రాజీవ్‌గాంధీతో మహేశ్‌కుమార్‌గౌడ్ (ఎడమ నుంచి రెండో వ్యక్తి)

గాంధేయ మార్గం అనుసరణీయం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: గాంధేయ మార్గం అందరికి ఆదర్శం, అనుసరణీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని గాంధీచౌక్‌లో గల మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. అదేవిధంగా మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, డీఆర్డీవో సాయాగౌడ్, కలెక్టరేట్ ఏవో పాల్గొన్నారు.



గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

కేజీబీవీ అధికారిణికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ అర్బన్: ఉద్యోగులను ఇష్టం వచ్చినట్లు తిడుతున్న మాక్లూర్ కేజీబీవీ అధికారిణికి మెమో జారీ చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. సదరు అధికారిణి తీరుపై బుధవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి మెమో జారీ చేశారు. ఆమె వివరణ తీసుకున్న తర్వాత కలెక్టర్‌ను సంప్రదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా కేజీబీవీలో సదరు అధికారిణి తీరుపై జీసీడీవో భాగ్యలక్ష్మి బుధవారం విచారణ నివేదికను డీఈవోకు అందజేశారు. ఈ నివేదిక ప్రకారం చర్యలు ఉంటాయని డీఈవో తెలిపారు.

భారీ జనసమీకరణపై ఫోకస్

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఘన స్వాగతానికి ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక మొదటిసారి జిల్లాకు వస్తున్న బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు రంగం సిద్ధం చేస్తున్నారు. భారీ జన సమీకరణే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. నిజామాబాద్ నగరంలో కార్యక్రమాలు, బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులను తరలించేందుకు గాను నాయకులు అన్ని మండలాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో జనసమీకరణ చేసేందుకు గాను ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆధ్వర్యంలో పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన ముప్ప గంగారెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. గత మూడు రోజులుగా గ్రామాల్లో తిరుగుతూ కార్యకర్తలను, పార్టీ అభిమానులను నిజామాబాద్‌కు తరలించేందుకు ముమ్మరంగా కసరత్తులు చేస్తున్నారు. ఇప్పటికే నిజామాబాద్ నగరం ఫ్లెక్సీలతో నిండిపోయింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటీలు పడి మరీ స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు.



జన సమీకరణపై మోపాల్‌లో చర్చిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుర్గమ్మ పూజకు వేళాయే..

- నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



శక్తి స్వరూపిణి దుర్గాదేవి గురువారం మండపాల్లో కొలువుదీరనుంది. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనుంది. ఆదిశక్తి అమ్మవారి పూజలకు జిల్లాలో భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఆశ్వయుజ పాడ్యమి నుంచి విజయ దశమి వరకు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయి. నవరాత్రులు జగదాంబను ఆరాధించే వారికి సర్వమాంగళ్యం చేకూరుతుందని దేవి పురాణం చెబుతోంది. అనంత నామాలతో అనంత శక్తితో విలసిల్లే శక్తి స్వరూపిణీని పూజించడమే దేవి నవరాత్రుల ప్రత్యేకత. అమ్మవారిని ప్రతిష్ఠించడానికి మండపాలను ముస్తాబు చేశారు.

– నిజామాబాద్ రూరల్



నగరంలో దుర్గామాత విగ్రహాలు

నేటి నుంచి ఫ్యామిలీ సర్వే

నిజామాబాద్ అర్బన్: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం గురువారం నుంచి అధికారులు సర్వే చేపట్టనున్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద నియోజకవర్గానికి రెండు గ్రామాలను ఎంపిక చేశారు. ఇంటింటి పరిశీలన చేపట్టి ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పరిశీలించనున్నారు. ఈ నెల 8 నాటికి సర్వేను పూర్తి చేయనున్నారు. 9న పరిశీలన నిర్వహించి సర్వేకు సంబంధించిన అన్ని అంశాలతో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపనున్నారు. ఆర్‌డీవో, మున్సిపల్ కమిషనర్‌లు నోడల్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారు.

డిజిటల్ కార్డులు

ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు రకరకాల గుర్తింపు కార్డులు ఉన్నాయి. వీటన్నింటిని కలిపి ఒకే డిజిటల్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రేషన్‌కార్డు, పెన్షన్లు, సహాయక సంఘాలు, రైతుభరోసా, రైతు బీమా, ఆరోగ్యశ్రీ తదితర వివరాలను నమోదు చేయనున్నారు.

సర్వే చేయనున్న గ్రామాలు

- ఆర్మూర్ మండలం రాంపూర్, ఆర్మూర్ పట్టణంలోని రెండో వార్డు.
- బాల్కొండ మండలం శ్రీరాంపూర్, భీమ్‌గల్‌లో ఏడో వార్డు.
- బోధన్ మండలం లగ్దాపూర్, బోధన్ మున్సిపాలిటీలోని 25వ వార్డు.
- నిజామాబాద్ నగరంలో 38, 45వ డివిజన్లు.
- డిచ్‌పల్లి మండలం సాంపల్లి, నిజామాబాద్ కార్పొరేషన్‌లోని మూడో డివిజన్.

సర్వేను సక్రమంగా నిర్వహించాలి

- డీపీవో శ్రీనివాస్

డిచ్‌పల్లి: ఫ్యామిలీ డిజిటల్ కార్డు (ఎఫ్‌డీసీ)ల జారీ కోసం చేపడుతున్న సర్వేను పక్కాగా నిర్వహించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సర్వే కోసం డిచ్‌పల్లి మండలం సాంపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. బుధవారం డిచ్‌పల్లి మండలం నడిపల్లి పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు సిబ్బందితో డీపీవో సమావేశం నిర్వహించి సర్వేపై అవగాహన కల్పించారు. ఇంటింటి పరిశీలన చేపట్టి, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఈ నెల 8వరకు సర్వే పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కీలకం కానున్నందున ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో ఒక బృందం, తహసీల్దార్ ఆధ్వర్యంలో మరో బృందం సర్వేలో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ నివేదిత, కార్యదర్శులు కిషన్‌రావు, రాధిక, కవిత తదితరులు పాల్గొన్నారు.



ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేపై అవగాహన కల్పిస్తున్న డీపీవో శ్రీనివాస్

క్లుప్తంగా

ఇందూరు నృత్యకారిణుల ప్రతిభ



నిజామాబాద్ రూరల్: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నటరాజ నృత్య నికేతన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన నాట్య ప్రదర్శనలో నిజామాబాద్ అంజలి సిస్టర్స్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థినులు ప్రతిభ చాటారు. జిల్లాకు చెందిన సుమారు 15 మంది నాట్య కళాకారిణులు హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభకనబరిచారు. 155 మంది కళాకారులు ఒకేసారి నృత్యాన్ని ప్రదర్శించగా, మాస్టర్ గీతాంజలి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన చిన్నారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రైస్ మెడల్ సాధించారు.

మద్నూర్‌లో దొంగల హల్‌చల్

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన రోడ్డు వెంబడి తాళం వేసి ఉన్న ఇళ్లను దుండగులు టార్గెట్ చేస్తున్నారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో ప్రధాన కూడలిలో తాళం వేసి ఉన్న ఇంట్లో మంగళవారం దుండగులు చోరీకి పాల్పడ్డారు. చోరీకి పాల్పడిన ఇంటి చుట్టూ ఉన్న ఇళ్లకు బయటి నుంచి దుండగులు గడియ పెట్టారు. బుధవారం ఉదయం ఇళ్లకు బయటి నుంచి గడియపెట్టి ఉండడంతో సన్నిహితులకు సమాచారం అందించారు. దుండగులు చోరీకి వచ్చి గడియపెట్టినట్లు గ్రహించారు. గత రెండు నెలల క్రితం ఇదే ఇంటికి వేసి ఉన్న తాళాన్ని పగలగొట్టిన దుండగులు బంగారం, వెండి వస్తువులతోపాటు నగదు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అప్పుడు జరిగిన చోరీ కేసులోనే దుండగులు ఇప్పటికీ పట్టుబడలేదని, మళ్లీ అదే ఇంట్లో దుండగులు చోరీకి వచ్చారని స్థానికులు అంటున్నారు.

డాక్టరేట్ అందుకున్న కృష్ణ



దోమకొండ : గవర్నర్ బిష్ణుదేవ్ శర్మ చేతుల మీదుగా దోమకొండకు చెందిన యువకుడు కంఠం కృష్ణ డాక్టరేట్ అందుకున్నారు. ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 24వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టా అందజేశారని కృష్ణ తెలిపారు.

ఢిల్లీ పోలీసులమని నమ్మించి రూ.9.29 లక్షలు కాజేత

కామారెడ్డి క్రైం: తాము ఢిల్లీ పోలీసులమని ఓ వ్యక్తిని నమ్మించిన సైబర్ నేరగాళ్లు అతడి ఖాతాలో నుంచి రూ.9.29 లక్షలు కాజేశారు. ఈ ఘటన కామారెడ్డిలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన కిషన్‌రావుకు గత నెల 26న గుర్తు తెలియని ఫోన్ చేసి.. ఢిల్లీ నుంచి పోలీసు అధికారులం మాట్లాడుతున్నామని అన్నాడు. నీపై డ్రగ్స్, మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయని, నిన్ను అరెస్ట్ చేయడానికి పోలీసులు వస్తున్నారని నమ్మించాడు. అరెస్ట్ చేయకుండా ఉండాలంటే నీ అకౌంట్‌లో ఉన్న మొత్తం డబ్బులు తాము సూచించిన ఖాతాకు పంపాలన్నాడు. కేసు పూర్తయిన తర్వాత డబ్బు తిరిగి పంపుతామని చెప్పడంతో కిషన్‌రావు నాలుగు విడుతల్లో రూ.9.29లక్షలను వారు సూచించిన అకౌంట్‌లో జమ చేశాడు. తర్వాత తాను మోసపోయినట్లు గ్రహించి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

పోలీస్ బాస్ పాలనకు ఏడాది



- గతేడాది అక్టోబర్ 13న బాధ్యతలు స్వీకరించిన సీపీ కల్మేశ్వర్
- ఎన్నికల వేడిలో వచ్చి శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తూ..
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి
- పొలిటికల్ బదిలీలకు బ్రేక్
- పండుగల వేళ పకడ్బందీ బందోబస్తు
- ఆర్టీవో సమన్వయంతో విస్తృతంగా వాహనాల తనిఖీ
- రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై చేసిన వారిపై చర్యలు

పైరవీ బదిలీలకు బ్రేక్

బదిలీల కోసం రాజకీయనాయకులను ఆశ్రయించే ఎస్సైలు, సీఐలకు సీపీ చెక్ పెట్టారు. బదిలీల్లో రాజకీయ పైరవీలకు ఆస్కారం లేకుండా చేశారు. ఎస్సైలు, సీఐల బదిలీలకు సంబంధించిన జాబితాను సీపీ సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. రాజకీయ నాయకుల అండదండలతో వచ్చారనే ఆరోపణలున్న ఆర్మూర్, డిచ్‌పల్లి సీఐలను సీపీ వెనక్కి పంపించారు. నెల రోజుల క్రితం సీఐల బదిలీలు జరుగగా జిల్లాకు చెందిన ఓ లీడర్ వాటిని అడ్డుకున్నట్లు ప్రచారం ఉంది. ఇటీవల అవే ఉత్తర్వులు అమలుకావడం బదిలీల్లో రాజకీయ నాయకుల ప్రమేయం లేదనేది మరోసారి స్పష్టం చేసింది.

ఖలీల్‌వాడి: ఓవైపు ఎన్నికల వాతావరణం.. మరోవైపు కేంద్ర ఎన్నికల సంఘం నిక్కచ్చి ఆదేశాలు.. అప్పటి సీపీ సత్యనారాయణ బాధ్యతలు చేపట్టి కేవలం 40 రోజులైంది. అయితే ఆయన పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదుల కారణంగా కేంద్ర ఎన్నికల సంఘం గంటల వ్యవధిలోనే సీపీ మార్పునకు ఆదేశాలు ఇచ్చింది. సీపీ సత్యనారాయణను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం 2023 అక్టోబర్ 11న రాత్రి ఆదేశాలు జారీ చేసింది. మరుసటి రోజు(12వ తేదీన) 5గంటల్లోగా కొత్త సీపీని నియమించాలని సూచించింది. సైబరాబాద్ క్రైం డీసీపీగా పని చేస్తున్న కల్మేశ్వర్ సింగనేవార్ 13వ తేదీన రాత్రి వచ్చి విధుల్లో చేరారు. ఎన్నికల వాతావరణంలో బాధ్యతలు చేపట్టిన కల్మేశ్వర్ నాటి నుంచి తనదైన ముద్రవేశారు. పరిస్థితులు ఎలా ఉన్నా నిక్కచ్చిగా వ్యవహరిస్తూ వస్తున్నారు. వచ్చింది మొదలు శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన.. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా కృషి చేశారు. ఎన్నికల సంఘం చర్యల్లో భాగంగా సీపీగా వచ్చిన ఆయన త్వరలోనే బదిలీపై వెళ్లిపోతారని ఎన్నికలు ముగిసిన నాటి నుంచి ప్రచారం జరిగినా.. ఆయన తనదైన పనితీరుతో ముందుకెళ్తున్నారు. ఎప్పటికప్పుడు వీడియోకాన్ఫరెన్స్‌లో నిర్వహిస్తూ ఎస్సైలు, సీఐలకు సూచనలు చేస్తూ జిల్లాలో క్రైం రేట్ తగ్గేలా కృషి చేశారు. వినాయకచవితి, రంజాన్, దేవీ నవరాత్రులు తదితర పండుగల సమయాల్లో ఆయా మత పెద్దలను సమన్వయం చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో సీపీ సక్సెస్ అయ్యారు.

ఫిర్యాదు అందిన వెంటనే విచారణ

శాఖ సిబ్బందిపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పెషల్ బ్రాంచి అధికారులతో విచారణ చేయించి చర్యలు తీసుకున్నారు. కొందరు ఎస్సైలను సైతం సీపీ కార్యాలయానికి అటాచ్ చేసి వారి స్థానంలో కొత్తవారిని నియమించిన సందర్భాలున్నాయి. నేరుగా తనకు ఫిర్యాదు చేసిన బాధితుల సమస్యలను సంబంధిత ఎస్సైలను ఆదేశించి పరిష్కరింపజేశారు. అయితే నగరంలోని ఓ ఎస్‌హెచ్‌వోపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శాఖ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

ప్రశాంతంగా ఎన్నికలు

2023 నవంబర్ 30న జరిగిన శాసనసభ ఎన్నికలపై సీపీ ఫోకస్ పెట్టారు. ఐదు నియోజకవర్గాల పరిధిలో 407 సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి సక్సెస్ అయ్యారు. పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి అంక్షలు విధించారు. 2024 మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగగా, నియోజకవర్గం పరిధిలోని జగిత్యాల జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా కృషి చేశారు.

ప్రమాదాల నివారణపై..

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై సీపీ ప్రత్యేక దృష్టి సారించారు. రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరించారు. పోలీసు సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు చేయించారు. అంతేకాకుండా ఆర్టీఏ, ట్రాఫిక్ సిబ్బంది, పోలీసులతో వారంలో రెండు రోజులు వాహనాల తనిఖీ చేయించారు. దీంతో వాహనాల చోరీలతోపాటు చైన్‌స్నాచింగ్‌లు తగ్గాయి. దీంతోపాటు వాహనాల రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పెరిగింది. హెల్మెట్ ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేయిస్తున్నారు.

'రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్'కు ఎన్‌జీఎస్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నిజామాబాద్ నాగారం: 68వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు నవ్య భారతి గ్లోబల్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో పీఎస్ అంజలి, శివాణి, మోక్ష, ఇందూజ, బాలుర విభాగంలో వరుణ్, లిఖిత్, శ్రీ వర్ధన్ ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ సంతోష్‌కుమార్, కరస్పాండెంట్ శ్రీదేవి తెలిపారు. ఇటీవల స్థానిక డీఎస్‌ఏ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో నవ్య భారతి పాఠశాల జట్లు పాల్గొనగా, బాలికల విభాగంలో 4-1 తేడాతో కామారెడ్డి జట్టుపై విజయం సాధించి టోర్నమెంట్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. నారాయణపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరుపున తమ పాఠశాల విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు.

వరద బాధితులకు చిన్నారుల చేయూత



ఎడపల్లి(బోధన్): మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో ఉన్న ఇమేజ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆర్థికసాయం అందజేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హనుమంతుకు రూ.16,116 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ వేషధారణలో వచ్చిన చిన్నారులను కలెక్టర్ అభినందించారు. హెచ్‌ఎం శైలజ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ఐదుగురి ఆత్మహత్య

రైలులో ఉరేసుకొని ..



ఖలీల్‌వాడి: బోధన్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న గుంతకల్ ప్యాసింజర్ రైలులో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. బుధవారం నిజామాబాద్ రైల్వేస్టేషన్ మేనేజర్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని, ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులకు (87126 58591) నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..



ఎర్రం నవీన్ (ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): ఆర్థిక ఇబ్బందుల కారణంగా మండల కేంద్రంలోని రాజానగర్ ప్రాంతానికి చెందిన ఎర్రం నవీన్(31) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బతుకు దెరువు కోసం గతంలో రెండు సార్లు దుబాయికి వెళ్లిన వచ్చిన ఎర్రం నవీన్.. మళ్లీ అక్కడికే వెళ్లేందుకు అప్పు చేసి ఏజెంట్‌కు డబ్బులు కట్టాడు. వీసా రాకపోవడంతో మనస్తాపం చెంది గతనెల 29వ తేదీన పురుగుల మందు తాగగా, కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం నవీన్ మృతి చెందాడు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

కాకతీయ కాలువలో దూకి ఒకరు..



జగదీశ్వర్(ఫైల్)

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామ శివారులో కాకతీయ కాలువలో దూకి గ్రామానికి చెందిన కర్తన్ జగదీశ్వర్(60) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రజినీకాంత్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో కిరాణాదుకాణం నడుపుతూ జగదీశ్వర్ కుటుంబంలో చిన్నచిన్న గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి కాకతీయ కాలువ వద్దకు వెళ్లాడు. చెప్పులు, కళ్ల జోడును కాలువ మెట్లపై పెట్టి కాలువలో దూకాడు. బుధవారం ఉదయం కాలువ వద్ద చెప్పులు, కళ్లజోడును గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువ వెంబడి గాలింపు చర్యలు చేపట్టగా జగిత్యాల్ జిల్లా మెట్‌పల్లి శివారులోని కాలువలో మృత దేహం లభ్యమైంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆడుకోవద్దన్నందుకు..

ఖలీల్‌వాడి: ఆడుకునేందుకు బయటికి వెళ్లొద్దన్నందుకు ఓ బాలిక ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఖిల్లా ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. ఆడుకునేందుకు బయటికి వెళ్లొద్దని ఖిల్లారోడ్డు ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలికను తల్లి మూడు రోజుల క్రితం మందలించడంతో మనస్తాపానికి గురైన బాలిక అదే రోజు ఎలుకల మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కాగా మంగళవారం రాత్రి మళ్లీ అస్వస్థతకు గురికావడంతో ఆమెను మళ్లీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాసిన్ అరాఫత్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక మహిళ..



లలిత మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మానగర్ రోడ్ నంబర్.1కు చెందిన కట్ట లలిత (53)అనే మహిళ కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కడుపునొప్పితోపాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న లలిత మనస్తాపానికి గురై గత నెల 27న బాత్ రూమ్‌లో పురుగుల మందు సేవించిందని, కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. మృతురాలి సోదరుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని వాజిద్‌నగర్ మంజీర వాగులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. నీటి ప్రవాహానికి మృతదేహం కొట్టుకువచ్చిందని, మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుందని, కుడి చేయిపై ఇంగ్లిష్‌లో సోను అని, నల్ల ప్యాంటు ఉందన్నారు. ఎక్కడో నీటిలో మునిగి చనిపోయి ఉంటాడని, నీటి ప్రవాహానికి మృతదేహం కొట్టుకు వచ్చినట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బర్కత్‌పురా కాలనీలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై యాసీన్ అరాఫత్ తెలిపారు. బర్కత్‌పురాకు చెందిన అఫ్రోజ్, మునీఫ్ ఖాన్ నాందెడ్‌కు చెందిన కరీం నుంచి గంజాయి కొనుగోలు చేసి చిన్న, చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారన్నారు. వీరిదరిపై చాలా రోజుల నుంచి నిఘా పెట్టామన్నారు. అఫ్రోజ్‌ఖాన్‌పై ఇంతకు ముందు కూడా గంజాయి కేసులు ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరి నుంచి గంజాయితోపాటు మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, రిమాండ్ తరలించామన్నారు.

పేకాటస్థావరాలపై దాడి

మాక్లూర్ : మండలంలోని రెండు చోట్ల పేకాట స్థావరాలపై టాస్క్ ఫోర్స్ సీఐ పురుషోత్తం ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు చేశారు. ముందుగా అడవిమామిడిపల్లి శివారులోని పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.52వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గుత్ప శివారులో కొనసాగుతున్న మరో పేకాట స్థావరంపై దాడి చేసి రూ.4వేల నగదును స్వాధీనం చేసుకుని నలుగురి అదుపులోకి తీసుకున్నారు.

సీజ్ చేసిన గంజాయి దహనం



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి క్రైం: జిల్లాలో నమోదైన 15 కేసులకు సంబంధించి 137 కిలోల గంజాయితోపాటు ఐదు గంజాయి మొక్కలను నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం పడకల్ తండా ప్రాంతంలో ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో బుధవారం దహనం చేశారు. కామారెడ్డి పట్టణంతోపాటు దేవునిపల్లి, రాజంపేట, గాంధారి, సదాశివనగర్, నస్రుల్లాబాద్, పెద్ద కొడప్‌గల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి పట్టుడగా దహనం చేసినట్లు ఏఎస్పీ నరసింహారెడ్డి తెలిపారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు, డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్, సీఐలు తిరుపయ్య, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ సేవలు మరువలేనివి



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



లాల్ బహదూర్‌శాస్త్రి విగ్రహానికి..

ఖలీల్‌వాడి: మహాత్మాగాంధీ సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు, గాంధీచౌక్, తిలక్‌గార్డెన్ చౌరస్తాల్లో ఉన్న వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహాత్ముడు చూపిన శాంతి, అహింస మార్గాల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కొందరు మహాత్ముడిని తక్కువ చేసి, గాడ్సేను గొప్ప వ్యక్తిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి ప్రధానిగా ఎన్నో సేవలు చేశారని దేశం ఆర్థికంగా బలపడుతూ, ముందుకు వెళ్లడానికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని, వారిద్దరి సేవలు ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంభూపాల్, వేణురాజ్, వైశాఖ సంతోష్, రాజనరేందర్ గౌడ్, బొబ్బిలి రామకృష్ణ, పోల ఉష, కోనేరు విజయలక్ష్మి, కోర్వ రాజేందర్, ఖైసర్, నరేంద్రసింగ్, లవంగ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెడ్‌క్రాస్ సేవలు ఆదర్శనీయం



పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి సునీత

నిజామాబాద్ నాగారం: జిల్లా రెడ్‌క్రాస్ సేవలు ఆదర్శనీయమని జిల్లా కోర్టు న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకొని న్యాయమూర్తి రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా వార్డుని బుధవారం సందర్శించి పిల్లలకు పండ్లు అందజేశారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సేవలు విస్తృతమయ్యాయని, భవిష్యత్‌లో జాతీయస్థాయిలోనూ జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలన్నారు. రక్తనిధి సేవలు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. అనంతరం రక్త దాతల సమన్వయకర్త నరాల సుధాకర్‌ను సన్మానించారు. న్యాయమూర్తిని రెడ్‌క్రాస్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపె రవీందర్, డాక్టర్ నీలి రాంచందర్, నిజామాబాద్ డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం, మోపాల్ మండల చైర్మన్ వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ రాజేశ్, నాగేందర్, పీఆర్వో బొడ్డుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పదవుల రేసులో జిల్లా నాయకులు

- ఈనెల 7న పీఆర్టీయూ రాష్ట్ర ఎన్నికలు
- ప్రధానకార్యదర్శి రేసులో మోహన్‌రెడ్డి



రాష్ట్ర ఎన్నికల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

నిజామాబాద్అర్బన్: విద్యాశాఖలో ప్రధాన సంఘమైన పీఆర్టీయూ రాష్ట్ర ఎన్నికల్లో జిల్లాకు చెందిన నాయకులు ప్రధానపాత్రను పోషిస్తున్నారు. జిల్లా నుంచి వరుసగా రాష్ట్రస్థాయి పదవులను పొందుతూ ప్రాధాన్యతను దక్కించుకుంటున్నారు. ఈసారి కూడా రాష్ట్రస్థాయి పదవులకు జిల్లా నుంచి పోటీలో ఉన్నారు. పీఆర్టీయూ జిల్లా ఎన్నికలు ఇటీవల ముగియగా, రాష్ట్ర ఎన్నికలు ఈ నెల7న నిర్వహించనున్నారు. గత కొంతకాలంగా రాష్ట్ర ఎన్నికల్లో జిల్లాకు చెందిన నాయకులు గెలుపొందుతూ వస్తున్నారు. జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మోహన్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముఖ్యపాత్ర పోషించారు. 26 ఏళ్లపాటు రాష్ట్ర సంఘంలో కొనసాగారు. అనంతరం జిల్లా నుంచి రాష్ట్రానికి వరుసగా పదవులు దక్కించుకున్నారు. బోధన్ ప్రాంతం నుంచి రవికిరణ్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసి గెలుపొందారు. మాక్లూర్ మండలానికి చెందిన బీరెల్లి కమలాకర్ రావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగి ఇటీవలే పదవీ విరమణ చేశారు. ఈనెల 7న జరగబోయే రాష్ట్ర సంఘం ఎన్నికల్లో జిల్లా నుంచి ప్రస్తుత పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి బరిలో నిలిచారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి 33 జిల్లాలకు సంబంధించిన పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులు రాష్ట్ర నాయకత్వాన్ని ఎన్నుకుంటారు. మోహన్‌రెడ్డి ఇదివరకే 33 జిల్లాల్లో ప్రచారం నిర్వహించి బరిలో నిలిచారు. ప్రస్తుతం మేడ్చల్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల నుంచి ఎక్కువ మంది బరిలో ఉన్నప్పటికీ నిజామాబాద్ జిల్లాకే ఎక్కువ అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిసారి రాష్ట్ర నాయకత్వం ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా ప్రధాన పాత్ర వహిస్తుండడంతో ఈసారి కూడా ప్రధానకార్యదర్శి పదవి దక్కే అవకాశం ఉందని జిల్లా పీఆర్టీయూ నాయకులు పేర్కొంటున్నారు.

శాపూర్‌లో ఉద్రిక్తత



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్తులు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని శాపూర్‌లో ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. శాపూర్ గ్రామానికి చెందిన శివయ్య సర్వే నంబర్ 469/2/అ/పీ/1 నంబర్‌లోని 11 గుంటల భూమిని నల్ల పోచమ్మ ఆలయానికి విరాళంగా ఇచ్చాడు. పక్కనే ఉన్న సర్వే నంబరు 469లో నికాల్‌పూర్ గ్రామానికి చెందిన జైడి చిన్నారెడ్డికి ఐదున్నర ఎకరాల భూమి ఉంది. తన భూమి గుడికి చెందిన భూమిలో కలిసిందని చిన్నారెడ్డి పంట సాగు చేయడంతో గతంలో పలుమార్లు శాపూర్ గ్రామస్తులకు, జైడి చిన్నారెడ్డికి మధ్య ఘర్షణ జరిగింది. పోలీస్ స్టేషన్‌లో ఇరు వర్గాలపై కేసులు సైతం నమోదయ్యాయి. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో గుడికి ఆరు గుంటల భూమిని కేటాయిస్తూ హద్దులు ఏర్పాటు చేశారు. ఆ భూమిలో కంచెకు ఉన్న రాళ్లు పడిపోయి కంచె ధ్వంసం అయిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆదివారం ఘటనా స్థలానికి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. జైడి చిన్నారెడ్డి సోయా విత్తనాలను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఇరువర్గాలను సముదాయించారు. ఎస్సై అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌ను తరలించారు.

నగదుతో పరారైన వారి పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

బీబీపేట: ఆసరా, చేయూత పింఛన్ డబ్బులు రూ.10 లక్షలతో పరారైన పోస్టల్ మాజీ ఉద్యోగి దేవిసోత్ బిక్యానాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోస్టాఫీస్ డబ్బులను పక్కదారి పట్టించడంతో బిక్యానాయక్ గత మూడు నెలల క్రితం సస్పెండ్ అయ్యాడు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఇస్సానగర్, తుజాల్‌పూర్ గ్రామాలకు చెందిన ఆసరా, చేయూత పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రూ.10 లక్షలను ఇన్‌చార్జి పోస్ట్‌మాస్టర్ అనిల్ బీబీపేటకు తీసుకు వచ్చి బిక్యానాయక్ అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉంచాడు. అనిల్‌ను నమ్మించిన బిక్యానాయక్‌తోపాటు అతడి స్నేహితుడు వాకోడోత్ సురేశ్ రూ.10 లక్షలతో పరారయ్యారు. పోస్ట్‌మాస్టర్ అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను కోటగిరి మండలం సుద్దులం తండాలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10లక్షలు రికవరీ చేశామని, నిందితులను కోర్టులో హాజరుపరిచామని ఎస్సై తెలిపారు.